క్లుప్తంగా

నేడు తిరుమలయ్యపల్లెలో ‘వై ఏపీ నీడ్స్ జగన్’

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్య పల్లె–2 గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం సాయంత్రం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

15న చలో విజయవాడ



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎం నేతలు

పుత్తూరు: ఈనెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆటో స్టాండ్ వద్ద చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా రక్షణ భేరి పేరిట విజయవాడలో ఈనెల 15న నిర్వహిస్తున్న మహాప్రదర్శనలో అన్ని కార్మిక సంఘ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, అలాగే రాష్ట్రంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఆటో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఆటో వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో వర్కర్స్ సమస్యలపై రాష్ట్ర మహాసభలో పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి ఆటో కార్మికుడు సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, ప్రవీణ్, సుధాకర్, శివ పురుషోత్తం పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశ్వర స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

నేటి నుంచి రుద్రాభిషేకం



నాగాభరణం, త్రిశూలం బహూకరిస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్: ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో నున్న ధ్యానారామంలోని బృహదీశ్వరస్వామికి మంగళవారం నుంచి నెల రోజులు లోక క్షేమాన్ని కాంక్షిస్తూ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాన్ని శైవాగమ పండితులతో చేపడతారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీ భక్తి ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

నాగాభరణం, త్రిశూలం బహూకరణ

ధ్యానారామంలోనున్న బృహదీశ్వరస్వామికి తిరుపతికి చెందిన ఆర్.శ్యాంసుందర్‌రెడ్డి, డాక్టర్ మునిశంకర్‌రెడ్డి, వేదవర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ పి.అంజిరెడ్డి రూ.4 లక్షలు విలువైన పంచలోహల నాగాభరణం, త్రిశూలాన్ని బహూకరించారు. వారికి వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తిరుపతికి చెందిన కమల శ్రీనివాసన్ రూ.20 వేలు పరదాలు అందజేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ రాధేశ్యామ్ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన సూర్యనారాయణ రూ.1,08,000 విరాళంగా అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం స్వామివారి దర్శనానికి వచ్చారు. అనంతరం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులును కలిసి విరాళం అందజేశారు.

వెలుగులు పంచిన దీపావళి



నగరి: కరకంతేశ్వర స్వామి ఆలయంలో కేదారగౌరీ వ్రతం ఆచరిస్తున్న భక్తులు



కేదారగౌరీ వ్రతం ఆచరిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా



గౌరీవ్రతంలో పాల్గొన్న భక్తులు



శ్రీకావేరిరాజుపురంలో..

- భక్తిశ్రద్ధలతో కేదార గౌరీవ్రతం ఆచరించిన భక్తులు
- కిక్కిరిసిన ఆలయాలు
- అట్టహాసంగా దీపావళి వేడుకలు
- మంత్రి రోజా ఇంట దీపావళి సందడి

నగరి: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి పండుగ అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం మంత్రి రోజా ఇంట్లో దీపావళి సందడి నెలకొంది. దీపావళిని పురస్కరించుకుని ఆమె కుటుంబ సభ్యులతో కలిసి టపాసులు కాల్చి ఆనందంగా పండుగ జరుపుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో ఇంటి వద్దే కేదారగౌరి, ధనలక్ష్మి వ్రతం ఆచరించారు. వాహనాలకు ఆయుధపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రపంచ దేశాల్లో ఉన్న తెలుగువారికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుంటామన్నారు. అలాగే మన రాష్ట్రంలో నాలుగేళ్ల క్రితం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన నారావారి నరకాసుర పాలనను అంతమొందించి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి వెలుగులు తెచ్చారని, నేడు ప్రజలు ఆనందంగా దీపావళి పండుగ జరుపుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆమె భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో కేదారగౌరీ వ్రతం

నగరి: మున్సిపల్, మండల పరిధిలో ఆదివారం దీపావళి పండుగను వైభవంగా జరుపుకున్నారు. అన్ని ఆలయాల్లో కేదార గౌరీవ్రతాన్ని భక్తిప్రపత్తులతో ఆచరించారు. దీపావళి, నోములు రెండూ ఒకేరోజు వచ్చాయి. కొందరు ఆదివారం దీపావళి, సోమవారం కేదారగౌరీ వ్రతాన్ని ఆచరించారు. మహిళలు పూజాసామగ్రితో అమ్మవారి ఆలయాలకు వెళ్లి వ్రతపూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు ముత్తైదువులకు నోముదారాలు ఇచ్చి ఆశీస్సులు అందజేశారు.

ఘనంగా కేదార గౌరీ వ్రతం

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని అల్లియల్లమ్మ తల్లి ఆలయంలో దీపావళి సందర్భంగా సోమవారం కేదార గౌరీ వ్రతం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు రవీంద్ర రెడ్డి, పార్థసారథి రెడ్డి, గుణశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మహిళలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, సాముహిక కేదార గౌరీ వ్రతం నోములు నోచుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆనంద అయ్యంగార్, ఆలయ సిబ్బంది, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలవ్యాప్తంగా గ్రామాల్లో దీపావళిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అలాగే దీపావళి సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరీవ్రతం నోములు నిర్వహించారు. తయ్యూరు పాయకట్టులో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మ దేవస్థానం గౌరీ వ్రతంలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసింది. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలవ్యాప్తంగా ప్రజలు దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరక చతుర్థశిని పురస్కరించుకుని యువత, పిల్లలు పెద్ద ఎత్తున గ్రామాల్లో బాణసంచా కాల్చి సందడి చేశారు. భక్తి ప్రపత్తులతో నోములు, గౌరీ వ్రతం ఆచరించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలు దీపావళిని వేడుకగా జరుపుకున్నారు. అమ్మవారి ఆలయాల్లో మహిళలు కేదార గౌరీవ్రతం ఆచరించారు.





కుటుంబసభ్యులతో కలిసి టపాకాయలు కాలుస్తున్న మంత్రి రోజా, గంగాధరనెల్లూరు: అల్లియల్లమ్మ ఆలయంలో కేదార గౌరీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామికి సీకాయపట్టెడ గ్రామస్తుల కృతజ్ఞతలు



శ్మశాన వాటిక ఏర్పాటుపై చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం: కొన్ని దశాబ్దాల కాలంగా తీరని సమస్యకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా సీకాయపట్టెడ గ్రామస్తులు మాట్లాడుతూ సుమారు ఏడు దశాబ్దాలుగా తమ గ్రామానికి శ్మశానం లేక ఇబ్బంది పడుతున్నామని, అయిన వారు చనిపోతే సొంత పొలాలు, కాలువ గట్లపై ఖననం చేసేవారమని తెలిపారు. శ్మశానం ఏర్పాటు చేయాలని అనేకమార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవ తీసుకుని సమస్య పరిష్కరించారని తెలిపారు. ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపిన ఉప ముఖ్యమంత్రి ఎప్పటికీ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పాంజలి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, సచివాలయ కన్వీనర్ కుమార్, పురుషోత్తం రెడ్డి, లోకనాథనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పురవీధుల్లో వేణుగోపాలుడి కటాక్షం



భక్తులను కటాక్షిస్తున్న శ్రీవేణుగోపాలుడు

కార్వేటినగరం: నగరం ప్రసిద్ధి శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో దీపావళి ఆస్థాన వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని వేదపండితులు సుప్రభాత సేవతో మేల్కొలిపి స్వామివారి మూల విరాట్‌కు అర్చనలు అభిషేకాలు చేపట్టారు. అనంతరం వేద పండితులు స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపం వద్ద వేంచేపు చేశారు. అనంతరం వేద మంత్రాలు పఠిస్తూ దీపావళి ఆస్థాన వేడుకలను వైభవంగా నిర్వహించారు. తరువాత ఉత్సవమూర్తులను పట్టు వస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటా కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

లీలాకృష్ణారెడ్డికి డిప్యూటీ సీఎం పరామర్శ



లీలాకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం, ఆర్టీసీ వైస్ చైర్మన్

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండల ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్ రెడ్డి కుమారుడు లీలాకృష్ణారెడ్డిని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి పరామర్శించారు. అనారోగ్యం బారిన పడిన లీలాకృష్ణారెడ్డి వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసి సోమవారం వారు ఆస్పత్రికి వెళ్లి లీలాకృష్ణారెడ్డిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సీఎంసీ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వారు కోరారు.

ఎన్ఎస్‌యూలో సుందరకాండ పారాయణం



సంస్కృత వర్సిటీలో వెలిగించిన దీపాలు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదివారం సాయంత్రం దీపావళి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. వర్సిటీలో రఘునాథాచార్యముక్త ప్రాంగణంలో సుందరకాండ పారాయణం చేశారు. అనంతరం లక్ష్మీదేవి పూజ చేశారు. విద్యార్థులకు దీపావళి విశిష్టతను వివరించారు. దీపావళి పండుగలో ‘దీప ఆవళి’ అంటే దీపముల వరుస అని, దీప ప్రజ్వలన అనేది మనసులోని భావాన్ని బయటకు తీసుకురావడమని వివరించారు. దీపమే పరబ్రహ్మ అని, జ్ఞాన దీపాన్ని వెలిగించి శాస్త్రాల్లోని జ్ఞానాన్ని సమాజానికి అందించాలన్నారు. అనంతరం విద్యార్థులు 10 వేలకు పైగా దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో వీసీ ధర్మపత్ని రామలక్ష్మి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రమాశ్రీ, అధికారులు ఆచార్య చక్రవర్తి రాఘవన్, సత్యనారాయణ, డిప్యూటీ రిజిస్ట్రార్ వైవీ కృష్ణారావు పాల్గొన్నారు.

స్కంధషష్ఠి ఉత్సవాలు ప్రారంభం



పుష్పాలంకరణలో వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి

నగరి : పట్టణ పరిధిలోని కరకంతేశ్వర స్వామి ఆలయంలో స్కంధషష్ఠి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం గణపతి పూజ, వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు స్వామి వారికి పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల దర్శనార్థం ఆలయ మండపం వద్ద ఉంచారు. భక్తులు అధికసంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. హారతి పూజలు, ఊంజల్ సేవ నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఉభయదారులకు ఆలయ మర్యాదలు చేశారు. భక్తులు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 18న సూరసంహారం, 19న కల్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు.

నేడు ఇస్కాన్‌లో గోపూజ, గోవర్దన్ మహోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీకృష్ణ భగవానుడు గోవర్ధన గిరిని ఎత్తి గోపాలురు, గోవులను సంరక్షించిన రోజును పురస్కరించుకొని ఇస్కాన్ మందిరంలో మంగళవారం గోపూజ, గోవర్దన్ పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతిరమణదాస్ తెలిపారు. ఆయన సోమవారం ఇస్కాన్ ప్రతినిధులతో కలిసి గోవర్దన్ పూజా మహోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గోవర్దన్ పూజా మహోత్సవం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు



తాటితోపువీధిలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ

పుత్తూరు: మున్సిపాలిటీలోని ప్రతిపక్ష పార్టీకి చెందిన కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో కూడా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మున్సిపాలిటీలో మొత్తం 27 వార్డులు ఉండగా 22 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఉన్నారు. మరో 5 వార్డుల్లో మాత్రమే ప్రతిపక్ష పార్టీ టీడీపీ కౌన్సిలర్లు ఉన్నారు. అయితే మంత్రి రోజా చొరవతో పార్టీలకు అతీతంగా అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మున్సిపాలిటీ పాలకపక్షం, అధికారులు పట్టణంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందుకు 9వ వార్డు నిదర్శనంగా నిలుస్తోంది. గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచిన తాటితోపువీధిలోని డ్రైనేజీ సమస్యను ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలకపక్షం పరిష్కరించింది. 15వ ఆర్థిక నిధులు రూ.5 లక్షలతో డ్రైనేజీ ఏర్పాటు చేశారు. అలాగే శీలకారువీధిలో ఇటీవల మరమ్మతులకు గురైన బోరును స్థానిక వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ తిరునావక్కరుసు బాగుచేయించారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శీలకారువీధిలో చేతిబోరుకు ఇటీవల మరమ్మతులు చేయించడంతో నీరు పట్టుకుంటున్న మహిళ

బ్రహ్మోత్సవ వైభవం



పద్మావతి అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు ఆదివారం సింహవాహనంపై యోగలక్ష్మిగా, సోమవారం రాజమన్నార్ గా హనుమంత వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాబృందాల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

– చంద్రగిరి(తిరుచానూరు)



కళాకారుల కళా ప్రదర్శనలు



అమ్మవారి వేషధారణలో అలరిస్తున్న కళాకారిణి



కళావేదికపై కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు



పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారి వాహన సేవలో జీయంగార్లు







ఆకట్టుకున్న కళాకారుల తప్పెట గుళ్లు ప్రదర్శన, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు